
నమస్తే తెలంగాణ
హనుమకొండ
5 | వరంగల్, బుధవారం 11 డిసెంబర్ 2024 | HANUMAKONDA





డోర్నకల్ : గాంధీ సెంటర్‌లో తెలంగాణ తల్లి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎంపీపీ బాలూనాయక్ , బీఆర్ఎస్ శ్రేణులు

# కాంగ్రెస్ తల్లి వద్దు.. తెలంగాణ తల్లి ముద్దు..

## సచివాలయంలో విగ్రహం మార్పుపై భగ్గుమన్న బీఆర్ఎస్

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తెలంగాణ తల్లి విగ్రహాలు, ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం
- పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు నన్నపునేని, రాజయ్య, శంకర్‌నాయక్, రెడ్యానాయక్
- సీఎం రేవంత్‌రెడ్డి కక్షపూరిత వైఖరిపై మండిపాటు
- తెలంగాణ అస్థిత్వాన్ని ప్రశ్నార్థకం చేస్తున్నారంటూ ఆగ్రహం

కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్పు చేసి సచివాలయంలో ప్రతిష్ఠించడంపై ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, తెలంగాణవాదులు భగ్గుమన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు తెలంగాణ తల్లి విగ్రహాలు, ఫ్లెక్సీలకు మంగళవారం క్షీరాభిషేకం చేసి పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా 'కాంగ్రెస్ తల్లి వద్దు.. తెలంగాణ తల్లి ముద్దు' అంటూ నినాదాలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సాగిస్తున్న కక్షపూరిత చర్యలను ఖండించారు. తెలంగాణ అస్థిత్వాన్ని ప్రశ్నార్థకం చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో' అనే నినాదంతో ఉద్యమనేత కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షకు దిగడంతోనే ఆనాడు యూపీఏ ప్రభుత్వం దిగొచ్చి రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించిందని గుర్తు చేశారు. - నమస్తే నెట్‌వర్క్, డిసెంబర్ 10



మరిపెడ : తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్



భూపాలపల్లిలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పంచామృతాభిషేకం చేసి నినాదాలు ఇస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు



లింగాలఘనపురం : తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న తాటికొండ రాజయ్య

- ఖిలావరంగల్‌లోని తెలంగాణ తల్లి విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ తల్లిని, ప్రభుత్వాన్ని గాంధీభవన్‌కు పరిమితం చేసే రోజులు దగ్గరపడ్డాయని హెచ్చరించారు.
- లింగాలఘనపురం మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య పాలాభిషేకం చేశారు. విగ్రహం రూపురేఖలు మార్చడం సీఎం రేవంత్ రెడ్డి తుగ్లక్ పాలనకు పరాకాష్ట అని మండిపడ్డారు.
- మానుకోటలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ క్షీరాభిషేకం చేశారు. కేసీఆర్ హయాంలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు అనేక పథకాలు అందించారని, సీఎం రేవంత్ రెడ్డి ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు.
- మరిపెడ మండల కేంద్రంలో డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే ధరంసోత్ రెడ్యానాయక్ తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎందరో మహానుభావుల మేధస్సుతో రూపొందించిన విగ్రహాన్ని మార్చిన సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ అస్థిత్వాన్ని ప్రశ్నార్థకం చేశారన్నారు.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణీ సిద్ధు, బీఆర్ఎస్ అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్ పంచామృతాలతో అభిషేకం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో విధ్వంస పాలన కొనసాగిస్తున్నాడని మండిపడ్డారు.
- హనుమకొండ బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శరత్‌చంద్ర, జిల్లా కోఆర్డినేటర్ రాకేశ్‌యాదవ్ క్షీరాభిషేకం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి మార్పును పాలనలో చూపాలని, పేర్లు, విగ్రహాలను మార్చడంలో కాదని హితవు పలికారు.
- జనగామ ఆర్టీసీ చౌరస్తాలో తెలంగాణ తల్లి ఫ్లెక్సీకి మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, కౌన్సిలర్లు క్షీరాభిషేకం చేశారు. కేసీఆర్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తూ నాశనం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు.
- ములుగు బీఆర్ఎస్ భవన్‌లో తెలంగాణ తల్లి చిత్రపటానికి బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాలెపు శ్రీనివాస్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్ క్షీరాభిషేకం చేశారు. రాష్ట్ర సచివాలయం ఎదుట బతుకమ్మలేని కొత్త విగ్రహాన్ని ఆవిష్కరించడం సిగ్గుచేటన్నారు.



ఖిలావరంగల్‌లో క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్



మహబూబాబాద్ రూరల్ : తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్, బీఆర్ఎస్ నాయకులు



హనుమకొండ: బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు



పాలకుర్తి : దర్దేపల్లిలో క్షీరాభిషేకం చేస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

# బతుకమ్మ లేని తెలంగాణ తల్లిని ఊహించలేం

## కేసీఆర్ దీక్షకు భయపడి తెలంగాణ ఇచ్చారు

- తెలంగాణ ద్రోహి సీఎం రేవంత్‌రెడ్డి.. సోనియా బలిదేవత అన్నది నీవే
- సంస్కృతిని విస్మరించినందుకు ప్రజలకు క్షమాపణ చెప్పాలి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు డిమాండ్
- పాలకుర్తి, దేవరుప్పుల, కొడకండ్లలో తెలంగాణ తల్లి విగ్రహాలకు క్షీరాభిషేకం

పాలకుర్తి/దేవరుప్పుల/కొడకండ్ల, డిసెంబర్ 10 : బతుకమ్మ లేని తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఊహించలేమని.. బతుకమ్మ స్థానంలో కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుతో కొత్త విగ్రహాన్ని ఆవిష్కరించడం చారిత్రక తప్పిదమని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మండిపడ్డారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలు తెలియని సీఎం రేవంత్‌రెడ్డి చరిత్రను మార్చాలనుకోవడం మూర్ఖత్వమే అవుతుందన్నారు. కాంగ్రెస్ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించి తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను విస్మరించినందుకు రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. విగ్రహ మార్పును నిరసిస్తూ మంగళవారం దేవరుప్పుల మండలం సీతారాంపురం, పాలకుర్తి మండలం దర్దేపల్లి, కొడకండ్ల మండలకేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహాలకు బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఎర్రబెల్లి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయాచోట్ల ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ఉద్యమ ఫలితంగానే, దీక్షకు భయపడే కేంద్రం తెలంగాణ ఇచ్చిందనేది అక్షర సత్యమని అన్నారు. నాడు సోనియాగాంధీని బలిదేవత అన్న రేవంత్‌రెడ్డి నేడు ముఖ్యమంత్రి హోదాలో తెలంగాణ ఇచ్చిన దేవత అని పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు. తామంతా టీడీపీలో ఉన్న సమయంలో ప్రత్యేక తెలంగాణను సమర్థిస్తూ కేంద్రానికి లేఖ రాద్దామన్నప్పుడు రేవంత్‌రెడ్డి వ్యతిరేకించారని.. అలాంటి తెలంగాణ ద్రోహికి తెలంగాణ పదం ఉచ్చరించే అర్హత లేదన్నారు. ఆనాడు తెలంగాణకు అనుకూలంగా లేఖ ఇవ్వకపోతే అందరం టీడీపీని వీడుతామని చంద్రబాబుకు అల్టిమేటం ఇచ్చామని గుర్తుచేశారు. ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలన్నింటినీ తుంగలో తొక్కిన రేవంత్‌రెడ్డి, ప్రజాపాలన అంటూ మూర్ఖంగా ప్రవర్తిస్తున్నారని ధ్వజమెత్తారు. హైడ్రా పేర కూల్చివేతలు, ఆరు గ్యారెంటీలను అటకెక్కించిన రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని మండిపడ్డారు. మరోవైపు బిల్లుల కోసం మాజీ సర్పంచ్‌లు అసెంబ్లీ ముట్టడికి పిలుపునిస్తే వారిని ఎక్కడికక్కడ బంధించి నియంతృత్వంగా వ్యవహరిస్తున్నాడని.. అలాగే ఆశ కార్యకర్తలను నిర్బంధించి కొట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అనంతరం ఉద్యమకారులు ఆవుల వీరన్న, బస్వ రమేశ్, బాషిపాక కొండయ్యలకు శాలువాలు కప్పి సన్మానించారు.

**రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా మరో ఉద్యమం..**

సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ ద్రోహి అని ఎర్రబెల్లి మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమంలో ఒక్క రోజు కూడా పాల్గొనలేదన్నారు. ఉద్యమకారులపై తుపాకీ ఎక్కుపెట్టిన తెలంగాణ రైఫిల్‌రెడ్డి.. రేవంత్‌రెడ్డి అని ఎద్దేవా చేశారు. తెలంగాణ కోసం టీడీపీ ఎమ్మెల్యేలుగా తాము 15 మంది రాజీనామా చేస్తే పారిపోయిన దొంగ రేవంత్‌రెడ్డి అని విమర్శించారు. రేవంత్‌రెడ్డి ఓ అవినీతిపరుడు, బ్లాక్ మెయిలర్, మోసగాడని అధికారం కోసం అడ్డదారులు తొక్కి ప్రజలను మోసం చేసిన చరిత్ర ఆయనదన్నారు. ఆరు గ్యారెంటీలు, 420 మోసాలతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డిని ప్రజలు ఉరికించి కొడుతారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా మరో ఉద్యమం ప్రారంభమవుతుందని, అందులో ఆయన కొట్టుకుపోవడం ఖాయమన్నారు.

**ప్రజలే బుద్ధి చెబుతారు..**

తెలంగాణ ప్రజలను మోసం చేసి రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చాడని 'రూ. 500కు గ్యాస్ ఎంతమందికి ఇస్తున్నావు, ఉచిత కరెంటు ఎంతమందికి ఇస్తున్నావు, నాలుగు వేల పెన్షన్ ఎక్కడ పోయింది, తులం బంగారం ముచ్చటే లేదు, మహిళలకు ఇస్తానన్న రూ.2500 సాయం ఏమైంద'ని ఎర్రబెల్లి ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలు చైతన్యవంతులని రేవంత్‌కు వాళ్లే బుద్ధి చెబుతారని.. ఉరికిచ్చి కొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు.

# డబ్బులిస్తే.. డబుల్ ఇస్తాం!

- అమాయకులను బురిడీ కొట్టిస్తున్న అభయ్ ట్రస్టు
- ఆశపడి అధిక మొత్తంలో చెల్లింపు
- తిరిగి ఇవ్వకుండా తిప్పించుకుంటున్న వైనం
- న్యాయం చేయాలంటున్న బాధితులు



బాధితుడు మనోహర్

ఖిలావరంగల్, డిసెంబర్ 10 : ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని ట్రస్టు పేరుతో ఓ ముఠా ఘరానా మోసానికి పాల్పడుతున్నది. వరంగల్ నగరంలోని శివనగర్‌లో గుట్టు చప్పుడు కాకుండా కార్యాలయాన్ని ఏర్పాటు చేసి కార్యకలాపాలు కొనసాగిస్తున్నది. ట్రస్టుకు 50 శాతం ఇస్తే పిల్లల స్కూల్ ఫీజు 100 శాతం చెల్లిస్తామని, డబ్బులు డబుల్ ఇస్తామని, సగం ధరకే కుట్టు మిషన్లు అందజేస్తామని ప్రజలను నమ్మించిన నిర్వాహకులు తిరిగి చెల్లించకుండా తమ కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటున్నారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం రోడ్డులో అభయ ఫౌండేషన్ పేరిట భవనాన్ని అద్దెకు తీసుకున్న నిర్వాహకులు కొంత మంది మహిళలను నియమించుకొని అమాయకులకు ఎరవేసే పనిలో నిమగ్నమయ్యారు. తొలుత డబ్బులిచ్చిన కొంతమందికి కుట్టు మిషన్లు అందించడంతో నమ్మిన ప్రజలు ట్రస్టుకు భారీగా డబ్బులు చెల్లించారు. అయితే నెలలు గడుస్తున్నా నిర్వాహకులు తిరిగి డబ్బులు చెల్లించకపోవడంతో బాధితులు రోజూ కార్యాలయానికి వచ్చి పోతున్నారు. కాగా, ములుగు జిల్లా మల్లంపల్లికి చెందిన మనోహర్ అనే వ్యక్తి ఆశ పడి అభయ ఫౌండేషన్ ట్రస్టుకు బియ్యం సరఫరా చేశారు. మొదటి నెల సరిపడా డబ్బులు ఇచ్చినప్పటికీ ఆ తర్వాత తిప్పించుకుంటున్నట్లు బాధితుడు ఆరోపించారు. పలుమార్లు ఆఫీసుకు వెళ్లడంతో చెల్లని చెక్కులు ఇచ్చినట్లు తెలిపాడు. దీనికి తోడు స్కూలు ఫీజు, కుట్టు మిషన్లు ఇవ్వకపోవడంతో కొంతమంది కార్యాలయం వద్దకు వెళ్లి గొడవకు దిగుతున్నారు. దీంతో వస్తువులు, డబ్బులు వచ్చే నెలలో ఇస్తామని, అప్పటి వరకు ఎవరూ కార్యాలయానికి రావొద్దని నోటీసు బోర్డులో అతికించారు. అయితే ఆ లోపే బోర్డు తిప్పేస్తారేమోననే అనుమానాన్ని కొంతమంది బాధితులు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ట్రస్టు పేరుతో మోసం చేస్తున్న వారిపై అధికారులు చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో నలుగురి ఆత్మహత్యాయత్నం

- ఒకరి పరిస్థితి విషమం
- అందరిదీ ఒకే కుటుంబం

వరంగల్ చౌరస్తా, డిసెంబర్ 10 : ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఆత్మహత్యకు యత్నించారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ప్రస్తుతం వరంగల్ ఎంజీఎం దవాఖానలో చికిత్స పొందుతున్నారు. వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా తాండూరు మండలం కాసిపేట గ్రామానికి చెందిన సముద్రాల మొండయ్య(60), భార్య శ్రీదేవి(50), కూతురు చైతన్య(30), కుమారుడు శివప్రసాద్(26) మంగళవారం ఉదయం క్రిమిసంహారక మందు తాగారు. స్థానికులు మంచిర్యాల ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించగా, వైద్యుల సూచన మేరకు ఎంజీఎంకు తీసుకురాగా చికిత్స అందిస్తున్నారు. కాగా శివప్రసాద్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని, మిగతా ముగ్గురి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

# ప్రజల 40 ఏళ్ల ఆకాంక్ష కోచ్ ఫ్యాక్టరీ

- కాజీపేటను డివిజన్‌గా అప్‌గ్రేడ్ చేయాలి
- అన్ని రైళ్లకు హాల్టింగ్ కల్పించాలి
- వరంగల్ రైల్వే స్టేడియాన్ని అభివృద్ధి చేయాలి
- బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం
- ఎంపీ వద్దిరాజుతో కలిసి కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు వినతి



రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రతో కలిసి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు వినతి పత్రం అందజేస్తున్న దాస్యం వినయ్‌భాస్కర్

హనుమకొండ, డిసెంబర్ 10 : తెలంగాణ స్వరాష్ట్ర స్వప్నం ఎలాగో కోచ్ ఫ్యాక్టరీ కూడా వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రజల 40 ఏండ్ల ఆకాంక్ష అని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు తెలిపారు. మంగళవారం ఢిల్లీలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రతోపాటు రైల్వే శాఖ మంత్రిని కలిసి కోచ్ ఫ్యాక్టరీ, రైల్వే డివిజన్ ఏర్పాటు తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని దాస్యం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రిని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కోచ్ ఫ్యాక్టరీకి కావాల్సిన స్థలాన్ని మాజీ సీఎం కేసీఆర్ హయాంలోనే రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి అప్పగించిందని రైల్వే మంత్రికి దాస్యం తెలిపారు. కాజీపేట రైల్వే జంక్షన్‌ను డివిజన్ స్థాయికి త్వరితగతిన అప్‌గ్రేడ్ చేయాలని, అన్ని రైళ్లకు హాల్టింగ్ కల్పించాలని, ప్లాట్‌ఫామ్స్ పెంచాలని, ఎక్కువ బడ్జెట్ కేటాయించాలని కోరారు. వరంగల్‌లోని రైల్వే స్టేడియాన్ని అభివృద్ధి చేయాలన్నారు. కోచ్ ఫ్యాక్టరీతో పాటు డివిజన్ ఏర్పాటును సాధ్యమైనంత త్వరగా చేపట్టాలని, అలాగే స్థానికులకే 60 శాతం ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. కాజీపేట ఐటీఐ విద్యార్థులకు స్థానికంగా అప్రెంటిస్‌షిప్ కల్పించాలన్నారు. చిరువ్యాపారులకు వెండింగ్ జోన్లు కట్టించాలని, బోడగుట్ట ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలన్నారు. ఫాతిమా వద్ద నిర్మాణంలో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని కోరారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో కార్పొరేటర్ సంకు నర్సింగ్, నాయకులు నార్లగిరి రమేశ్, కొండ్ర శంకర్, దువ్వ కనకరాజు, బరిగెల వినయ్, గబ్బెట శ్రీనివాస్ తదితరులున్నారు.

# ఇల్లు ఇస్తారా? ఆత్మహత్య చేసుకోవాలా?

- డబుల్ బెడ్రూం ఇంట్లో మహిళ నిరసన
- తనకు కేటాయించినా వేరొకరికి ఇచ్చారంటూ ఆగ్రహం



రాఘవాపూర్‌లో డబుల్ బెడ్‌రూం ఇంట్లో నిరసన వ్యక్తం చేస్తున్న లబ్ధిదారు రజిత

స్టేషన్‌ఘన్‌పూర్, డిసెంబర్ 10 : కేసీఆర్ ప్రభుత్వం నిరుపేదల కోసం నిర్మించిన డబుల్ బెడ్రూం ఇంటిని తనకు కేటాయించినప్పటికీ మరొకరికి ఇచ్చారంటూ ఓ మహిళ ఇంటి లోపల గడియ పెట్టుకుని నిరసన వ్యక్తం చేసింది. ఈ ఘటన మంగళవారం జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండలం రాఘవాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తితే ఐదేళ్ల క్రితం రాఘవాపూర్‌లో 40 డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించి 33 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మిగిలిన వాటిలో నాలుగింటిని నాలుగు రోజుల క్రితం, మిగిలిన మూడింటిని మంగళవారం తహసీల్దార్, ఆర్ఐ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ విషయం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన రావుల శ్రీనివాస్, రజిత దంపతులు అక్కడకు చేరుకొని తమ పేరు మొదటి లిస్టులోనే వచ్చినప్పటికీ ఇల్లు ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ డబుల్ బెడ్రూం ఇంట్లోకి వెళ్లిన రజిత లోపల గడియ పెట్టుకుని ఇల్లు ఇస్తారా? లేదంటే ఆత్మహత్య చేసుకోవాలా? అంటూ బెదిరించింది. దీంతో అక్కడికి పోలీసులు, రెవెన్యూ అధికారులు చేరుకుని బుధవారం ఈ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రజిత బయటకు వచ్చింది. కాగా, ఏడు ఇళ్లను రూ. 3 లక్షల చొప్పున నాయకులు, అధికారులు తీసుకొని అనర్హులకు పంపిణీ చేశారని బాధితురాలు ఆరోపించింది. వాటిని రద్దు చేసి గ్రామసభ ద్వారా తిరిగి లబ్ధిదారులను ఎంపిక చేయాలని డిమాండ్ చేసింది. నిరుపేదలైన స్థానికులకు కాకుండా, బతకడానికి వచ్చిన వారికి పంపిణీ చేయడం ఎంత వరకు సమంజసమని రజిత అధికారులను ప్రశ్నించింది.

# భూమికి బదులు భూమివ్వాలి

## ఆర్డీవో కార్యాలయం ఎదుట మామునూరు భూ బాధితుల నిరసన

ఖిలావరంగల్, డిసెంబర్ 10 : భూమికి బదులుగా భూమి ఇవ్వాలని మామునూరు ఎయిర్‌పోర్టు కింద భూములు కోల్పోతున్న రైతులు మంగళవారం వరంగల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. నక్కలపల్లి, గుంటూరుపల్లి, గాడిపల్లి గ్రామాల్లో సుమారు 253 ఎకరాల వ్యవసాయ భూములు, ఇండ్లు, స్థలాలు కోల్పోతున్నామని, తమ అనుమతి లేకుండానే హద్దులు ఏర్పాటుచేశారని ఆవేదన వ్యక్తంచేశారు. భూమి బదలాయింపు జరిగిన తర్వాతే పనులు చేపట్టాలని కోరుతూ ఆర్డీవోకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో బండి కోటేశ్వరరావు, హరిబాబు, రాజు, భాస్కర్, శ్రీనివాస్, రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



వరంగల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

# బయోకెమిస్ట్రీ ప్రొఫెసర్ రమేశ్‌కు ఉత్తమ అవార్డు



కందిమల్ల రమేశ్

నర్సంపేట, డిసెంబర్ 10 : నర్సంపేట ప్రభుత్వ వైద్య కళాశాల బయోకెమిస్ట్రీ అసోసియేట్ ప్రొఫెసర్, ఇన్‌చార్జి హెచ్‌వోడీ డాక్టర్ కందిమల్ల రమేశ్ ఉత్తమ అవార్డు అందుకున్నారు. ఇటీవల ప్రపంచ 2శాతం సైంటిస్ట్ లిస్టును ప్రచురించగా అందులో ప్రొఫెసర్ రమేశ్ పేరు ఉండడంతో పాటు వరుసగా నాలుగు సార్లు జాబితాలో ఎంపిక కావడం విశేషం. ప్రపంచ ప్రఖ్యాత స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ఏటా ఈ లిస్టును ప్రచురిస్తుందని తెలిపారు. అల్జీమర్స్, న్యూరోసైన్స్‌పై పరిశోధనలకు గాను ఈ అత్యున్నత పురస్కారం దక్కినట్లు రమేశ్ పేర్కొన్నారు. అనంతరం ఉత్తమ అవార్డు గ్రహీత రమేశ్‌ను పలువురు అభినందించారు.